


చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



గూగూడుకు పోటెత్తిన భక్తులు

మొహర్రం ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గూగూడుకు భక్తులు పోటెత్తారు. చిన్నసరిగెత్తుకు విచ్చేసిన భక్తులు స్వామివారికి చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం

36.1°/22.7°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఇ.భీమారావు, కార్యదర్శి ఎస్.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ ప్రారంభమవుతుందన్నారు. మోటార్ వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీచేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ ట్యాక్సు కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను రాజీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖాసీంస్వామికి పానకాలు

- ఘనంగా చిన్న సరిగెత్తు వేడుకలు



బత్తలపల్లి ఖాసీంస్వామికి చదివింపులు చేస్తున్న ముజావర్లు

బత్తలపల్లి: మొహర్రం వేడుకల్లో భాగంగా బత్తలపల్లిలో కొలువుదీరిన చిన్నఖాసీం స్వామి, పెద్దఖాసీంస్వామి పీర్లకు శుక్రవారం భక్తులు పానకాలు చదివించారు. రాత్రి చిన్న సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందువులు పకీరు బాబాలుగా దీక్ష చేపట్టారు. ముళ్లపొదలు, మొద్దులు తీసుకువచ్చి అగ్ని గుండాన్ని రగిలించి అలావ్ తొక్కారు. శనివారం ఉదయం గ్రామోత్సవం అనంతరం పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లి ఆయా గ్రామాల పీర్లతో కలిపి పూజలందుకుంటాయని ముజావర్లు మహబూబ్‌బాషా, కాశింపీరా, ఫక్రుద్దీన్, కాశింవలి తెలిపారు. ఈ విధంగా పీర్లు అన్ని గ్రామాలను సందర్శించడాన్ని ఆయా గ్రామాల పీర్లను జలధి రోజు (సోమవారం) భేటీకి బత్తలపల్లికి రమ్మని ఆహ్వానించినట్లుగా అందరూ భావిస్తారు. ఇదిలా ఉండగా గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాల్లో బత్తలపల్లి పీర్లకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామ పెద్దలు చర్యలు తీసుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఆదేశాలు జారీ చేశారు.

మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



రత్న, ఎస్పీ

పుట్టపర్తి టౌన్: హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అందరూ సోదరభావంతో మొహర్రం వేడుకలు జరుపుకోవాలన్నారు. వేడుకలకు పోలీసులతో ముందస్తు అనుమతులు తీసుకుంటే గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. మొహర్రం వేడుకల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేడుకలు ముగిసే వరకూ పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు.



గూగూడు కుళాయిస్వామి ఉత్సవాల్లో భిక్షాటన చేస్తున్న రేణుక రాజు

భిక్షమెత్తితేనే భుక్తి

- బాలయ్య ఇలాకాలో పింఛనూ కరువే

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సొంత ఇలాకాలోని ఓ దివ్యాంగుడు పింఛన్ అందక భిక్షమెత్తుకుని పొట్ట పోసుకుంటున్నాడు. హిందూపురానికి చెందిన రేణుక రాజు దివ్యాంగుడు. గత ప్రభుత్వంలో పింఛన్ వచ్చేది. కూటమి ప్రభుత్వంలో పింఛన్ మరింత పెరుగుతుందనుకున్నాడు. అయితే ఇందుకు విరుద్ధంగా పింఛన్ జాబితా నుంచి ఆయన పేరు తీసివేశారు. అధికారులను బతిమాలుకున్నా.. ఫలితం లేకపోయింది. దీంతో కొన్ని నెలలుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో తిరునాల, ఉత్సవాలు, శుభకార్యాలు జరిగే ప్రాంతాల్లో సంచరిస్తూ భిక్షమెత్తుకుంటున్నాడు. శుక్రవారం గూగూడు కుళ్లాయి స్వామి ఉత్సవాల్లో రేణుక రాజు భిక్షమెత్తుకుంటున్న దృశ్యం చూపరులను కలిచివేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పరిటాల అనుచరుల దౌర్జన్యం

- భానుకోటలో భూకబ్జాకు 'తమ్ముళ్లు' యత్నం
- గాలి మరలకు వెళ్లేందుకు దారి కావాలంటూ రుబాబు
- రైతులకు పరిహారం ఇవ్వకుండానే జేసీబీలతో పనులు ప్రారంభం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న బాధిత రైతులు
- ముగ్గురు రైతులకు సంబంధించి అర ఎకరా భూఆక్రమణ



రైతుల పొలాల్లో పరిటాల సునీత అనుచరులు వేసిన దారి, నిర్మించిన కల్వర్టు

సాక్షి, పుట్టపర్తి: మాజీ మంత్రి పరిటాల సునీత అండతో 'తెలుగు తమ్ముళ్లు' రుబాబు చేస్తున్నారు. 'అధికారం మాది..మాకు అడ్డేముంది' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేస్తున్నారు. వ్యాపారాలు, కాంట్రాక్టర్ల పేరుతో పచ్చని పంట పొలాలను కబ్జా చేస్తున్నారు. తాజాగా రైతుల పట్టా భూములనూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. రిజిష్టర్ పట్టా భూములను ఆక్రమించి జేసీబీ యంత్రాలతో చదును చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

రైతులపై దౌర్జన్యం

పవన విద్యుత్ ఉత్పత్తి కోసం కనగానపల్లి మండలంలో గాలిమరలు ఏర్పాటు చేస్తున్నారు. గాలిమర ఒక చోట ఉండగా.. అక్కడికి వెళ్లేందుకు దారి లేదు. దీంతో టీడీపీ నేతలు రైతులపై దౌర్జన్యం చేస్తున్నారు. భానుకోటలో సర్వే నంబరు 69/1 లో మొత్తం 9 ఎకరాల పట్టా భూమి ఉండగా.. అందులో ముగ్గురు రైతులకు చెందిన భూముల్లో గాలిమరకు దారి ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఒక రైతుకు చెందిన 35 సెంట్లు, మరో రైతుకు చెందిన ఏడు సెంట్లు, ఇంకో రైతుకు సంబంధించి 8 సెంట్లను దారి కోసం ఆక్రమించారు. రైతులను సంప్రదించకుండా.. పరిహారం అందజేయకుండా.. భూమిని చదును చేసే పనులు చేపట్టారు. దౌర్జన్యం తగదని చెబితే 'పరిటాల' పేరు చెబుతున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకట్ట ఏదీ?

వాస్తవానికి భూమి కావాలంటే రైతులను సంప్రదించి...పరిహారం ఎంతో చెప్పి...వారిని ఒప్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కూడా రైతుకు పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలి. కానీ కనగానపల్లి మండలంలో అలాంటి ప్రక్రియ ఏదీ లేకుండానే టీడీపీ నేతలు..గాలి మరలకు వెళ్లే దారి కోసం నేరుగా పనులు చేస్తుండటం గమనార్హం. దీంతో బాధిత రైతులు... తమ భూముల్లో తమకు తెలియకుండా కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలు జేసీబీలతో చదును చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దౌర్జన్యంగా పనులు



మాది పట్టా భూమి. రిజిష్టర్ పత్రాలన్నీ మా పేరు మీదనే ఉన్నాయి. అయితే పరిటాల సునీత అనుచరులు దౌర్జన్యంగా మా పొలంలో దారి తీసుకెళ్తున్నారు. నా భూమిలో 35 సెంట్లు కోల్పోవాల్సి వస్తోంది. మమ్మల్ని సంప్రదించకుండా... పరిహారం ఇవ్వకుండా భూమి ఆక్రమించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. రైతుల భూములు కబ్జా చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు పాలకులు చెప్పినట్లు అనుమానం కలుగుతోంది. మా భూమిని మాకు అప్పగించాలని కోరుతున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, భానుకోట

‘అల్లూరి’ జీవితం ఆదర్శప్రాయం



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

- జయంతి కార్యక్రమాల్లో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న
- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సీతారామరాజుకు ఘన నివాళి

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి టౌన్ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, స్వాతంత్య్ర ఉద్యమంలో ఆయన చూపిన వీరోచిత పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌తో పాటు జిల్లా పోలీసు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ రత్న అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

విలక్షమైన వ్యక్తిత్వం

అల్లూరి సీతారామరాజుది విలక్షమైన వ్యక్తిత్వమని కలెక్టర్ చేతన్ కొనియాడారు. అల్లూరి జయంతి వేడుకలో ఆయన మాట్లాడుతూ.. అల్లూరికి చిన్ననాటి నుంచే దైవభక్తి, దానగుణం, నాయకత్వ లక్షణాలు మెండుగా ఉండేవన్నారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయంగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, కలెక్టరేట్ ఏఓ వెంకటనారాయణ, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి త్యాగం మరవలేం

స్వాతంత్య్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగం మరువలేనిదని ఎస్పీ రత్న అన్నారు. పోలీస్ కార్యాలయంలో జరిగిన అల్లూరి జయంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్య్రం వస్తుందని నమ్మి... దాని కొరకే తమ ప్రాణాలు అర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. 27 ఏళ్ల వయస్సులోనే బ్రిటీష్ సైన్యాన్ని గడగడలాడించి వీరమరణం పొందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌ఐలు మహేష్, వలి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- వైద్యులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం

పుట్టపర్తి టౌన్: వివిధ జబ్బులతో ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్యులకు సూచించారు. శుక్రవారం ఆయన కొత్తచెరువులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ, శుభ్రత, హాజరు పట్టికను పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పేదల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికీ మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. శుభ్రత విషయంలో రాజీ పడకూడదన్నారు. అనంతరం ఆసుపత్రిలో నూతన నిర్మాణాలను పరిశీలించి నాణ్యతలో రాజీ పడకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీసీహెచ్‌ఎస్ మధుసూదన్‌తో పాటు డ్యూటీ వైద్యులు పాల్గొన్నారు.

తుంగభద్ర పరవళ్లు

- నిండుకుండగా టీబీ డ్యాం
- 21 గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల



తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ల ద్వారా నదిలోకి వెళ్తున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర పరుగులు తీస్తోంది. టీబీ డ్యాంలోకి ఉవ్వెత్తున వచ్చి పడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసుల సాగు, తాగునీటి కష్టాలు తీర్చే తుంగభద్ర డ్యాం నిండుకుండను తలపిస్తోంది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు డ్యాం నుంచి అదనపు నీటిని క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. శుక్రవారం సాయంత్రం 21 క్రస్ట్ గేట్లను రెండున్నర అడుగుల మేర పైకెత్తి డ్యాం నుంచి 59,220 క్యూసెక్కుల నీటిని నదికి, 6,632 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు వదిలారు. ఈ నేపథ్యంలో తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుంగభద్ర బోర్డు అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున.. నదికి మరింత నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 80 టీఎంసీలకు కుదించారు. ఈ నెల 10న హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్పడంతో ఆయకట్టు రైతులు వరి నార్లు వేసుకుంటున్నారు.

- ప్రసుత్తం తుంగభద్ర జలాశయంలో 1,633 అడుగులకు గాను 1624.73 అడుగులకు నీరు చేరింది. ఇన్‌ఫ్లో 58,027, అవుట్‌ఫ్లో 65,616 క్యూసెక్కులుగా ఉంది. డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రసుతం జలాశయంలో 75.610 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ఉత్కర్ష రవీంద్ర బృందం

సాయి కీర్తనం.. భక్త నర్తనం

ప్రశాంతి నిలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతి నిలయంలో శుక్రవారం ఆషాఢ ఏకాదశి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, గోవా నుంచి సుమారు 2,000 మందికిపైగా భక్తులు తరలివచ్చారు. రాత్రి ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఇండియన్ ఐడల్–14 సింగర్ ఉత్కర్ష రవీంద్ర వాంఖేడే తన బృందంతో సంగీత కచేరీ నిర్వహించారు. సత్య సాయిని కీర్తిస్తూ చక్కటి స్వరాలతో ఆలపించిన పాటలతో భక్తులంతా తన్మయత్వంతో నర్తించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.

ధర పట్టుకుంది

ఇంత కాలం నష్టాలు చవి చూసిన పట్టుగూళ్ల రైతులు.. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. వారం రోజులుగా పట్టుగూళ్ల ధరలు స్వల్పంగా పెరుగుతూ వచ్చాయి. దీంతో పట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ ధరలు మరికొంత కాలం నిలకడగా కొనసాగాలని కోరుకుంటున్నారు.

- క్రమేణ పెరుగుతున్న బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు
- కొన్ని రోజుల క్రితం కిలో రూ.600 లోపే..
- తాజాగా రూ.655 వరకు గరిష్ట ధర


హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన బైవోల్టిన్ పట్టుగూళ్లు

మడకశిర: జిల్లాలో మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలో బైవోల్టిన్ పట్టు సాగు చేసే రైతులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో దాదాపు 20వేల మంది పట్టు రైతులు బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు పెరుగుతుండడంతో హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో సందడి నెలకొంది.

గతమంతా నష్టాలే..

ఐదారు నెలలుగా పట్టుగూళ్లకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ వచ్చారు. కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రూ.600లోపే ఉండేది. ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మార్పు వచ్చింది. కొన్ని రోజులుగా బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు క్రమేణా పెరుగుతూ వస్తున్నాయి. కిలో పట్టుగూళ్ల గరిష్టంగా రూ.600కు పైగా ధర పలుకుతోంది. ఈ నెల 2న గరిష్ట ధర రూ.655కు చేరుకుంది. 3న స్వల్పంగా తగ్గి గరిష్టంగా రూ.630తో క్రయ విక్రయాలు సాగాయి. తాజాగా మార్కెట్‌కు శుక్రవారం దాదాపు 1,541 కిలోల పట్టుగూళ్లను రైతులు తీసుకురాగా, ధర గరిష్టం రూ.648కు ఎగబాకింది.

పెరుగుతున్న క్రయవిక్రయాలు

మార్కెట్‌లో ధర నిలకడగా కొనసాగుతుండడంతో హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో క్రయ విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. గత 8 రోజుల్లోనే 39,180 కిలోల బైవోల్టిన్ పట్టుగూళ్లు హిందూపురం మార్కెట్‌లో అమ్మకానికి రైతులు తీసుకువచ్చారు. వారం రోజుల క్రయవిక్రయాలను పరిశీలిస్తే... జూన్ 26న మార్కెట్‌కు 6,272 కిలోల పట్టుగూళ్లను రైతులు తీసుకువచ్చారు. అలాగే అదే నెల 27న 7,140 కిలోలు, 28న 6,847 కిలోలు, 29న 7,130 కిలోలు, 30న 4,061 కిలోల చొప్పున బైవోల్టిన్ పట్టుగూళ్ల క్రయవిక్రయాలు సాగాయి. ఈ నెల 1న 1,705 కిలోలు, 2న 3,641 కిలోలు, 3న 2,384 కిలోల పట్టుగూళ్లను మార్కెట్‌లో రైతులు విక్రయించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తుండడంతో పట్టుగూళ్ల ఉత్పత్తి పెరగడానికి అవకాశం ఏర్పడింది.

ప్రోత్సాహక ధనం విడుదలపై నీలి నీడలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బైవోల్టిన్ పట్టు రైతులకిచ్చే ప్రోత్సాహక ధనాన్ని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ నయా పైసా కూడా చెల్లించలేదని వాపోతున్నారు. ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్లలో విక్రయించే బైవోల్టిన్ పట్టుగూళ్లకు ప్రతి కిలోకు రూ. 50 చొప్పున ప్రోత్సాహక ధనాన్ని ప్రభుత్వం అందించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఈ ప్రోత్సాహక ధనాన్ని చెల్లించలేదు. దీంతో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలను విడుదల చేయడంతో పాటు ప్రోత్సాహక ధనాన్ని ఎప్పటికప్పుడు అందజేయాలని పలు మార్లు విజయవాడకు పట్టు రైతుల సంక్షేమ సంఘం నాయకులు వెళ్లి కూటమి ప్రభుత్వ పెద్దలను కలసి విన్నవించారు. అయినా ఫలితం దక్కలేదు.

హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో వారం రోజుల నుంచి బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు ఇలా...

తేదీ	కనిష్టం (కిలో)	గరిష్టం (కిలో)
జూన్ 28న	రూ.398	రూ.645
జూన్ 29న	రూ.358	రూ.612
జూన్ 30న	రూ.357	రూ.606
ఈ నెల 1న	రూ.425	రూ.626
ఈ నెల 2న	రూ.479	రూ.655
ఈ నెల 3న	రూ.430	రూ.630
ఈ నెల 4న	రూ.467	రూ.648

ఆనందంగా ఉంది



బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు స్వల్పంగా పెరిగాయి. కొన్ని రోజులుగా కిలో రూ.600కు పైగా ధర పలుకుతోంది. ఈ ధరలు మరింత పెరగాల్సి ఉంది. రూ.700 వరకు ధర పలికితే లాభదాయకంగా ఉంటుంది. అయితే గతంలో ధర లేకపోవడంతో చాలా నష్టపోయాం. ప్రస్తుతం కొనసాగుతున్న ధరలు నిలకడగా ఉండాలని కోరుకుంటున్నా.
– రవికుమార్, బీజీహళ్లి, రొళ్ల మండలం

సంక్షేమాన్ని మరచిన ప్రభుత్వం



పట్టు రైతుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయింది. ఏడాదిగా ఎలాంటి ప్రోత్సాహకం చెల్లించలేదు. ప్రోత్సాహక ధనం బకాయిలను పూర్తి స్థాయిలో చెల్లించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు.
– కెంచప్ప, మద్దనకుంట, అమరాపురం మండలం

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్


జూదరులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బత్తలపల్లి: స్థానిక మారుతీనగర్‌లో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. వివరాలను ఆయన వెల్లడించారు. అందిన పక్కా సమాచారంతో శుక్రవారం మారుతీనగర్‌లోని జొన్నలగడ్డ రంగనాయుడు ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్డు వద్దకు డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో పాటు సిబ్బంది చేరుకున్నారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,01,050 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. తనిఖీల్లో స్థానిక పోలీసులతో పాటు డీఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

హత్య కేసు నమోదు

ధర్మవరం అర్బన్: ఈ ఏడాది మే 29న గుర్తు తెలియని వ్యక్తులు ధర్మవరంలోని గీతానగర్‌లో నివాసముంటున్న చింతా రమాదేవి(55) ఇంట్లో చొరబడి ఆమె గొంతుకు తాడు బిగించి హత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం మృతి చెందడంతో దుండగులపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. కాగా, ఆమె భర్త సుబ్రహ్మణ్యం కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. ఒంటరిగా జీవిస్తున్న తన తల్లిపై హత్యాయత్నం చేశారంటూ కూతురు దీపిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

కలుషిత ఆహారం అందించిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా నాయకులు

ధర్మవరం రూరల్/పుట్టపర్తి: సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లిలోని కేజీబీవీలో గురువారం కలుషిత ఆహారం అందించి 70 మంది విద్యార్థినులు అస్వస్థతకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పురుషోత్తం రాయల్, వేముల అమర్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ధర్మవరంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

యువకుడి ఆత్మహత్య


సోమశేఖర్ మృతదేహం

పరిగి: ఉద్యోగం రాలేదన్న బెంగతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన శ్రీరాములు కుమారుడు కురుబ సోమశేఖర్ (29) మెకానికల్ విభాగంలో డిప్లొమా పూర్తి చేసి, నాలుగేళ్ల పాటు బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేశాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. సొంతూరిలోనే మేకలను కాచుకుంటూ తల్లిదండ్రులకు చేదోడు ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో ఇక తనకు ఉద్యోగం రాదన్న బెంగతో గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు తన తల్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం వేకువజామున ఇంటికి చేరుకున్న తల్లి తిప్పక్క ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపించింది. చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

గంజాయి కేసులో 17 మందికి జైలు

అనంతపురం: గంజాయి కేసులో 17 మందికి జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఇందులో 12 మందికి రెండేళ్ల జైలు, మరో ఐదుగురికి ఏడాది జైలు శిక్ష పడింది. మొత్తం 20 మందిపై అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2018లో కేసు నమోదు కాగా, అదే ఏడాది సెప్టెంబర్ 11న అరెస్ట్ చేసి, 3 కిలోల గంజాయి, రూ.40,12,000 నగదు, 32 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు క్యాలిక్యులేటర్లు, రూటర్, కారు స్వాధీనం చేసుకున్నారు. తర్వాతి కాలంలో నిందితుల్లో ముగ్గురు మృతి చెందారు. మిగిలిన వారిపై నేరం రుజువైంది. వీరిలో తాడిపత్రికి చెందిన అచ్చుకట్ల అబ్దుల్లా, మహమ్మద్ ఖాసీం, కోవెలకుంట్ల జాఫర్ వలి, గుత్తికి చెందిన ఎం.నారాయణ, వై.గోపాల్, ముల్లా జాఫర్, కోవెలకుంట్ల ఖలీల్, చౌడం సుబ్బరాయుడు, ఎర్రముక్కపల్లికి చెందిన గోనుగుంట్ల రామయ్య, పెద్దమండ్యం మండలం గుల్లకుంటకు చెందిన పి.రామచంద్రారెడ్డి, పి.జయచంద్రారెడ్డి, డోన్ పట్టణానికి చెందిన దూదేకుల ఇబ్రహీంకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20వేల చొప్పున జరిమానా విధించారు. తాడిపత్రికి చెందిన అచ్చుకట్ల సాదిక్ అలియాస్ కట్లపుడి సాదిక్, గుత్తి హబీబా ఖాన్, అచ్చుకట్ల అబుబకర్ అలియాస్ బకర్, చౌడం ప్రసాద్ కుమార్ అలియాస్ ప్రసాద్, డోన్‌కు చెందిన దూదేకుల లాల్ బాషాకు ఏడాది జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

హంతకుల కోసం ముమ్మర గాలింపు

ముదిగుబ్బ: మండల కేంద్రం శివారున రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న విశ్వనాథ్ హత్య కేసులో నిందితుల కోసం పోలీసు జాగిలాలతో వేట ప్రారంభించారు. హతుని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. శుక్రవారం ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ నేతృత్వంలో పోలీస్ జాగిలాలతో హత్య జరిగిన ప్రదేశంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

కదిరి అర్బన్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక ఇంట్లో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు రమేష్ చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో బాలిక కేకలు వేయడంతో లోపల పనిలో ఉన్న తల్లి బయటకు రాగానే పారిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

10న రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఎన్నికలు

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలు ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు సీనియర్ డీపీఓ హెచ్‌ఎల్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం కాల పరిమితి పూర్తి కావడంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ పరిధిలో దాదాపు 941 మంది ఓటర్లు ఉండగా సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, కోశాధికారితోపాటు ఆరుగురు కమిటీ మెంబర్లను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా, శుక్రవారం ముఖ్యమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ నెల 10న ఉదయం 8.00 నుంచి సాయంత్రం 4.00 గంటలకు వరకూ బ్యాలెట్ పత్రం ద్వారా ఓటింగ్ చేపట్టనున్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

కార్మికుల జీవితాలతో చెలగాటమొద్దు


అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

- కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించిన శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు
- ఏడు నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలి
- అనంత కలెక్టరేట్ ఎదుట ధర్నా
- మద్దతు పలికి న సీపీఎం, వైఎస్సార్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, రైతుసంఘాలు

అనంతపురం అర్బన్: కార్మికుల జీవితాలతో చెలగాటమాడరాదని కూటమి ప్రభుత్వాన్ని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు హెచ్చరించారు. ఏడు నెలలుగా బకాయిపడిన వేతనాన్ని తక్షణమే చెల్లించాలంటూ శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, ఐఎఫ్‌టీయూ ఏసురత్నం, రైతు కూలీ సంఘం రాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం రామకృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జి.ఓబుళు మాట్లాడుతూ.. నెలలుగా వేతనం చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. వేతనాలు చెల్లించాలంటూ 85 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ఇటు ప్రభుత్వం కానీ, అటు అధికారులు కానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. యోగా డే అంటూ వందల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వానికి కార్మిక కుటుంబాల ఆకలి కేకలు వినిపించడం లేదని మండిపడ్డారు. తక్షణమే ఏడు నెలల వేతన, 40 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఏబీఆర్ నుంచి హిందూపురం వరకూ ట్రంక్‌లైన్ కార్మికులకు ఆరు నెలల వేతనాలు, 26 నెలల పీఎఫ్ బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. ఫేస్–4 కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర కార్మికులకు రెండు నెలల వేతనం, 18 నెల పీఎఫ్, మడకశిర కార్మికులకు మూడు నెలల వేతనం, 36 నెలల పీఎఫ్, హిందూపురం కార్మికులకు 15 నెలల వేతనం, 15 నెలల పీఎఫ్ చెల్లించాల్సి ఉందన్నారు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చుతూ కార్మికులకు బకాయిలు చెల్లించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.5 కోట్ల నిధులు విడుదలైనట్లు కలెక్టర్ ఐదు రోజుల క్రితం ప్రకటించారని, అయితే ఆ డబ్బు నేటికీ కార్మికుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. కార్మికుల బకాయిలు పూర్తిగా చెల్లించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుండానే స్నాన ఘట్టాల నిర్మాణం


స్నాన ఘట్టాల నిర్మాణానికి నదిలో చదును చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని చిత్రావతి నదిలో నిర్మిస్తున్న స్నాన ఘట్టాలు వివాదాలకు తావిస్తున్నాయి. మరో నాలుగు నెలల్లో సత్యసాయి శత జయంతి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం చిత్రావతి నది ఒడ్డున స్నాన ఘట్టాలు, నది తీరం వెంబడి ఇరువైపులా సుమారు కిలోమీటరుకు పైగా రాతితో బండింగ్ పనులు, నది మధ్యన సత్యసాయి బాబా విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందు కోసం దాదాపు రూ.3.5 కోట్లను వెచ్చిస్తున్నారు. అయితే స్నాన ఘట్టాలు ఏర్పాటు చేసే స్థలం చాలా వరకూ ఆక్రమణకు గురైంది. ఇలాంటి తరుణంలో ఆక్రమణలు తొలగించకుండా నిర్మాణాలు చేపట్టడం వివాదాస్పదమవుతోంది. ఆక్రమణలు తొలగించకపోతే నది కుచించుకుపోయి, భారీ వర్షాలు కురిస్తే వరద మొత్తం పట్టణంలోకి చొరబడి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. తొలుత ఆక్రమణలు తొలగించిన తర్వాతనే స్నాన ఘట్టాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

గూగూడుకు పోటెత్తిన భక్తులు


చిన్నసరిగెత్తుకు ముస్తాబైన కుళ్లాయిస్వామి పీర్లు


భక్తుల పొర్లుదండాలు

నార్పల మండలం గూగూడులో కుళ్లాయిస్వామి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజామున చిన్నసరిగెత్తు సందర్భంగా అర్చకులు హుసేనప్ప కుళ్లాయిస్వామి పీరును ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. కుళ్లాయిస్వామి– ఆంజనేయ స్వామి దర్శనం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కాసేపు తొక్కిసలాట జరిగింది. చిన్న సరిగెత్తులో భాగంగా స్వామి వారి భక్తులు ఫకీర్లుగా మారి జలధి పోయే వరకు నియమనిష్టగా ఉంటారు.
– నార్పల / సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


అగ్నిగుండం వద్ద భక్త జనసందోహం


కిటకిటలాడుతున్న దుకాణాలు


చక్కెర చదివింపుల కోసం ..